# నచ్చినపిల్ల

కళ్యాణ మొచ్చినా కక్కొచ్చినా ఆగదంటారు. సూర్యుడిలాంటి వారు వెయ్యిమంది ఒక్కటైనా పోగొట్టలేని ఆ తండ్రిగారి హృదయంలోని చీకటి; అమ్మగారి ఆత్మశాంతికోసమైనా తమ్ముడు పెళ్ళాడితేబాగుండునన్న అక్కగారి ఆవేదన; నిజంగానే వీడు పెళ్ళి మానకుంటాడేమోనన్న బావగారి సందేహం; 'తాను పెళ్ళిచేసుకొంటే వొట్టు' అంటూ ప్రగల్భంగా అతగాడు చేసుకొన్న నిశ్చయం-వీటన్నిటికీ విరుగుడుగా కథ నడవడమే పైలోకోక్తికి బలం.

సూర్యుడు ఉదయిస్తున్నాడు. విచ్చుకత్తుల్లాంటి కిరణాలతో చీకటి పరదాల్ని చీకిరి బాకిరిగా చింపి పోగుపెట్టేస్తున్నాడు. కాని ఆ తాసీల్దారుగారి గుండెల్లోని చీకటిని మాత్రం తరిమివేయలేక పోతున్నాడు.

చీకటి!

ఆ తాసీల్దారు హృదయంలో మాసిపోని చీకటి!

అమ్మాయికి పెళ్ళికాలేదు. "అమ్మాయికి పెళ్ళి కాదు" అని అంతని చీకటిగుండెలో గుబులుగా ఓ మూలుగు.

ఆ అమ్మాకి పద్దెనిమిదేళ్ళు. అందాల ప్రోగు. తేట నీటి కోనేరులా నిర్మలమైన మనస్సు. మాటకు ఎదురాడని మృదుస్వభావం. నిప్పుకళికల్లా శిష్టమైనటువంటి గుణగణాలు. కాని ఎంచేతనో ఆమెకు పెళ్ళికాలేదు. ఆమెకు పెళ్ళి కాలేదని; తాసీల్దారుగారి హృదయంలో చీకటిలాంటి ఓ బెంగ. సూర్యుడిలాంటివాళ్ళు వెయ్యిమంది ఒక్కటైనా ఆ చీకటిని పోగొట్టలేరు. అలా పోగొట్టగలిగేది ఒక్కటే - అదేదో ఓ అద్భుత దీపం. ఆ అద్భుత దీపమే ఓ అల్లుడు.

నవజీవనానికి నాందిలా - ఉషస్సు!

నిద్రనుండి లేచినా శయ్యమీదనుంచి లేవకుండా కిటికీలోంచి బయటికి చూపులు సారించాడు ప్రాణిగ్రాహి.

మంచి మగువ మనస్సులా మనోహరంగా వుంది ప్రభాతం. దూరంగా, నీలికొండల అంచులను పదును బెడుతూ ఆకాశంలో కాలు మోపుతున్నాడు సూర్యుడు.

వలపుతలపుతో సుక్కిపోయే కన్నెపిల్ల చెక్కుటద్దంలా- అరుణరాగంతో నిండి, అందాలు విరజిమ్ముతోందిఅంబరం. పెరట్లో మల్లెతీగపైన కూర్చుని ఉయ్యాల లూగుతూ, రెక్కలు పటపటలాడిస్తూ కిచకిచ మంటోంది - ఓ పిచ్చుక. 'ఝుం' మంటూ ఎగిరివచ్చి, దానిమ్మ పూవుపై వాలి రేకులన్నీ తోసి లోపలికి జొరబడి-బలాత్కారంగా అందు లోంచి తేనెనంతా జుర్రుకుంటోంది ఒక తుమ్మెద.

పానకంలో తేటదనంలా నీరెండ; పుడకల్లా-చక్కగా పొడుగాటి నిడల పొడ; పానకంలో పుడకలా బావ రాకడ.

"వీపు రుద్దే వంకతో ఒళ్ళంతా రక్కేసింది. అబ్బబ్బ!...ఆ గోళ్ళు అలా పెంచుకుని, నాకు వాతలు దీయకపోతే - మట్టసంగా కత్తిరించేసుకోరాదూ?" అంటూ గదిలోకి వచ్చాడు నారాయణ. పంచె, బనీను, భుజంమీద తుండుగుడ్డతో విచ్చిపోయిన పత్రికాయులా వున్నా డతను.

పాణిగ్రహి-దేవతలా, దేవతాశిల్పంలా కళ్ళార్పక, ఒళ్ళు మెదల్పక బయటకేసి చూస్తూవున్నాడు. నారాయణ స్టూలుమీద కూర్చుని "బావమర్దీ!" అన్నాడు. బావమర్ది పరాకునబడి పలుక లేదు.

"ఆలోచనా?"

అంతరాయానికి లొంగని ఆలోచన.

"లేవవూ? గడ్డం చేసుకోవూ? నీళ్లోసుకోవూ!..."

"చూడ చక్కని చిన్నది..." అన్నాడు - పరాకున బడి బయటపడలేని పాణిగ్రాహి.

"ఎక్కడ?" అన్నాడు బావ విస్తుపోతూ.

"ఆ మేడగదిలో నున్నది..."

*  *  *

పాణిగ్రాహి సెలవుల్లో అక్కయ్య ఇంటికి కాలక్షేపం కోసం వచ్చాడు. అక్కయ్య యిల్లే అతని ఇల్లు. ఎందుచేత నంటే - అతనికి 'నా' అన్నవాళ్ళెంకెవరూ లేరు అమ్మా, నాన్నా పోయారు. లంకంత యిల్లూ, మోయలేనంత ఆస్తీ వున్నా యతనికి. కాని, ఎంత వున్నా ఏం ప్రయోజనం?... చిలకకు గోరింక తోడైతేనే కదా అందమూ ఆనందమూ?...

"వచ్చే జన్మానికేమో గానీ, ఈ జన్మలో మాత్రం 'పాహీ! పాణిగ్రాహీ!' అంటూ పిల్లేవచ్చి కాళ్ళపైబడినా పెళ్ళి జేసుకోను." అంటూ భీష్మ ప్రతిజ్ఞ ఒకటి చేసేశాడు పాణిగ్రాహి.

అతడామధ్య స్త్రీ జాతినిగురించి కాలేజీ మ్యాగజైనులో ఒక ఊహాకల్పన వ్రాశాడు... పూర్వం రాక్షసులందరూ బ్రహ్మనుగురించి ఘోర తపస్సు చేశారట. బ్రహ్మ ప్రత్యక్షమై ఏంకావాలన్నాట్ట. 'స్వామీ, మాకీ దానవుల బాధ భరింపరానిదైపోయింది. బ్రహ్మాస్త్రాలూ, ఆగ్నేయాస్త్రాలూ - యింకా యేవేవో ప్రయోగించి ఎక్కడున్నా మమ్మల్ని వెలికి వేటాడి చంపుతున్నారు. దశరథరాజు కొడుకు శ్రీరాముడు ముందుగా రామాయణం రాయించుకొని, లోకప్రసిద్ధుడైన మా లంకాధీశుడంతటి వాడినే పగబట్టి, పట్టి, కొట్టి, పొట్టనబెట్టుకున్నాడు. రక్షించు తండ్రీ!...

పగతీర్చుకునే శక్తులు ప్రసాదించు స్వామీ...!" అని మొరలు పెట్టుకున్నారట.

అప్పుడు బ్రహ్మ - 'నాయనలారా! అలాగే వరమిస్తున్నాను. ద్వాపరయుగం అంతమై కలియుగం అవతరిస్తుంది. ఆ యుగంలో-క్రీస్తుశకం ఇరవయ్యో శతాబ్దంలో-రాక్షసజాతి అనేదే వుండదు. అప్పుడు మీరందరూ - ఆడవాళ్ళుగా పుడతారు మీనోటే మీకువజ్రాయుధమౌతుంది. మానవ జాతిమీద మీకున్న ద్వేషాన్నంతా అప్పుడు చూపించి పగతీర్చుకోండి...' అని వరమిచ్చి అంతర్ధానమైనాట్ట. అందుకేనట - ఆడవాళ్ళంతా వాళ్ళవాళ్ళ మొగుళ్ళను నల్లులు కరిచినట్లు కరిచేస్తున్నారట; నల్లుల్ని రాచినట్టు రాచేస్తున్నారట!

ఒకసారి ఒక బాలకవి పాణిగ్రాహిని - 'స్త్రీ' కి పర్యాయపదాలు తెలిస్తే కొన్ని చెప్పు-అన్నాడు. అప్పుడు పాణిగ్రాహి- 'వనిత, ముదిత, మగువ, (సూర్య) కాంతం, గయ్యాళి' అన్నాడు.

'స్త్రీ అనగా గయ్యాళి అని ఎలా చెప్పగలవు?' అని ఎవరైనా అడిగితే - దానికి నిఘంటువుల్లాంటి నిదర్శనాలు బోలెడు చెప్పగలడు - పాణిగ్రాహి...

...నోట్లో నాలుక లేని ఓ సద్బ్రాహ్మణ్ణి - నాలుకలో ఎముక లేని అతడి భార్యామణి - నాలుగు చీపురుకట్టలు ఒకటిగా కట్టి (సినిమాలో) బాదుతుంటే - పాణిగ్రాహి చూసి, గాంధీగారి కోతుల్లో ఒక కోతి జ్ఞాపకంవచ్చి కళ్ళు

మూసుకున్నాడు. గొలుసుతో బొచ్చుకుక్కను, గొలుసు లేకుండా భర్తను (అతని ఎడమ చంకలో పాపాయి, కుడి చంకలో పాపాయి ఆడుకునే 'టాయి') వెంటబెట్టుకొని, విలాసంగా వాహ్యాళి కెళుతోన్న నవనాగరికపు వన్నెలాడిని చూచి, 'లోకమే ఒక పెద్ద జూ'...అనుకుని నిట్టూర్చాడు. ఇంట్లో చండికకు దీటుగా ఒక అతివ (వరుబోతు) యిరవై-నాలుగ్గంటలూ—'వెధవ, శకునపక్షి, దౌర్భాగ్యప్పీనుగ' అని తిట్టితిట్టి సొమ్మసిల్లిపోతూంటే ఒక భక్తయ్య 'రామా, కృష్ణా, గోవిందా' అనుకోడానికి వీలులేక, సన్యాసంపుచ్చుకున్న సందర్భంలో—పాణిగ్రాహి కాలేజీ విద్యార్థులనుండి తీర్థయాత్రల ఖర్చుకు గాను అతనికి ధర్మమిప్పించాడు; ఆత్మహత్య చేసుకున్న ఒక శవంగాడి జేబులో—"నా చావుకు ఎవరూ కారకులు కారు. అసలిది చావు కాదు...బ్రతికి బయటపడడం. మా యింటిదాని పోరు పడలేకుండా, విశ్రాంతికోసం ఆత్మహత్య చేసుకుంటున్నాను"—అన్న మాటలతో వున్న చీటీ వుదంతం తెలుసుకుని, గబగబా యింటికెళ్ళి—గ్రామఫోను దులిపి, తనకు నేపథ్యంగా—ఒక విషాదగీతం పాడించుకున్నాడు!...వీటికన్నా తార్కాణాలు మరేంకావాలి?...

వాళ్ళమ్మ—చనిపోయే రోజుల్లో—"ఒసేయ్! మన పాణి బుద్ధుడై ఉద్ధరించేదేమీ లేదు. త్వరగా ఓ పిల్లని కని, వాడికి ముక్కు దాడు వేసే భారం నీది!" అని నవనీతం మీద ఓ పెద్ద భారాన్ని మోపేసింది. "ఛస్! దానికి పిల్ల పుడితే యింకెవణ్ణయినా తెస్తాను గానీ—ఛస్తే నేను చేసు

కోను-" అన్నాడు పాణిగ్రాహి—నీటబాసిన చేపలా విలవి ల్లాడిపోతూ.

"మంకు వెధవ! వీడి పంతమే వీడికి! వీడికి పెళ్ళి జేయకుండా నేను కన్నుయినా మూస్తానా?" అంటూనే పాపం—ఆమె తన పంతం నెగ్గించుకోకుండానే కన్ను మూసేసింది.

"ఒరే పాణీ! అమ్మగారి ఆత్మశాంతి కోసమైనా పెళ్ళి చేసుకోరా బాబూ!"—అంది నవనీతం.

"నా మనశ్శాంతే గదా—అమ్మకు ఆత్మశాంతి?" అన్నాడు పాణి.

"ఇంతటి బ్రహ్మచర్యదీక్ష లోకమందు మరెందైన గానీ, మరేలోకమందైన గానీ గలదే?"...అంటూ ముక్కున వేలేసుకున్నాడు నారాయణబావ.

పాణిగ్రాహి వాళ్ళసాధింపులుపడలేక "ఇదిగో! ఇక నేను శవంగాడినైపోతాను. మీరు వూరికైనా వెళ్ళిపోండి; ఇక్కడైనా ఉండిపొండి; నేను మా హాస్టలు కెళ్ళిపోతున్నా సుమండీ!" అంటూ విసుక్కున్నాడు.

నవనీతం చిన్నబోయి - 'ఓరీ! నీ అమాయకత్వం కూల! నువ్వు ఏమీ కావద్దూ, ఎక్కడాపోవద్దు! ఇలా యోగిగానే ఉండిపో!_నాకేం?' అంది.

తర్వాత అక్కా, బావా ఊరి కెళ్ళిపోయారు, పాణి గ్రాహి కాలేజీకి వెళ్ళిపోయాడు.

సెలవుల్లో అక్కగారింటి కొచ్చాడు పాణిగ్రాహి.

నవనీతం గట్టి నిశ్చయం ఒకటి చేసేసుకుంది—‘ఈసారి వీడ్ని ఒంటరిగా పంపకూడదు’—అని.

కొన్నాళ్ళు సంక్షీభావంతో — నారాయణకూడా పాణిగ్రాహి అభిప్రాయంతో ఏకీభవించకతప్పలేదు.

“నువ్వన్నది నిజమేనోయ్ పాణీ!... అస్త్రాలన్నీ ఈ ఆడవాళ్ళ నోట్లోనే వున్నై. ఈటెల వేటులకన్నా మొనైన వీళ్ళ నోటి మాటలపోటులు మగవాడుమాత్రం భరించలేడు...” అని ఒప్పుకునేశాడు ఒకరోజున.

“చూడు బామర్దీ! చూడ్డానికి మీ అక్కయ్య ఎలా గుంది?...”

“అచ్చు కోకిలమ్మ!”

“ఒప్పుకున్నావా?...”

“రాసిస్తా...”

“ఇక విను! నాతప్పేమయినా వుందేమో ఇందులో—ఆ రోజుల్లో—నవనీతం, నేనూ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఓ స్నేహితుడు ‘ఒరే నారాయణా! అందె వేసుకోకపోయినా — నువ్వు ఆశుకవిత్వంలో ఆరితేరినవాడవుకదా?——యేదీ అక్కడ వెళ్తూన్న అమ్మాయిల్లో నీకు నచ్చిన అమ్మాయిని చప్పున వర్ణించేసెయ్యి’ అన్నాడు. నా రస హృదయం పొంగిపోయింది. పొంగింది పొంగి ఊరుకోక—పొర్లిపోయింది... ‘ఆకాశము నీలముగా నున్నది; ఆకు పచ్చగా నున్నది; చిలుక ముక్కు యెర్రగా నున్నది; పీచు బొగ్గు నల్లగా నున్నది; కాని — మా నవనీతం పళ్ళు చూడండి—యెంత తెల్లగా నున్నవో!... ఆమె నిత్యమూ

బినాకా టూత్‌పేస్టునే వాడును...' అంటూ ఏదో నాకు తోచింది కాస్తా అనేశాను. ఆమె గిర్రున ఇటు తిరిగి చుర చురా నాకేసి చూసి, 'పెళ్ళికాని, నీఆట కట్టిస్తా'అంటూ-జడను తెగిపోయేలా ఒక్క విసురువిసిరింది. ఇప్పుడు ఆమె ప్రతిజ్ఞ అక్షరాలా నెరవేర్చుకుంటోందనుకో! బినాకా టూత్‌పేస్టే కావాలంటుంది; మొదటిరోజే సినిమాకు వెళ్లాలంటుంది. ఆమె పెట్టెలు తెరచి, ఒకచిన్న చీరెలకొట్టు పెట్టొచ్చు. పూల దుకాణంలో ఒక పువ్వు నలిగిపోయినా ఈవిడ మనసొప్పదు. దీనిమాట కాదన్నా నా-అలిగి మూల కూచోవడం. సాధింపులూ, ఎత్తిపొడుపులూ, రుసరుసలూ-అబ్బ! ఎందుకులే! సన్యాసిసుఖం...?"

"చేసుకున్నది అనుభవించక తప్పుతుందా బావా?... నీ ప్రారబ్ధం! ఏంజేద్దాం? ఏకాంతంగా ఏడువు!" అన్నాడు పాణిగ్రాహి.

"అయితే బావమరదీ! నువ్వు పెళ్ళి చేసుకో నట్టేనా?"

"మాటంటే-మాట తప్పుతానా?...మాట తప్పడం మా వంశంలో లేదు..."

వంటింట్లోంచి ఈ మాటలన్నీ విన్న నవనీతం—గరిటతో నారాయణ ఎదుటకొచ్చి—"చాల్లే ఊరుకోండి. ఏమిటా మాటలు?" అంటూ భర్తను చీవాట్లు పెట్టింది!

"నే నేమన్నాను? మీ తమ్ముడే ఆడజాతి మీద కత్తి గట్టాడు?..." అన్నాడు నారాయణ-వేళాకోళ మాడుతున్నాంగదా-అనుకుంటూ.

"వాడిప్పటికే భీష్మించు కూర్చున్నాడు. నాలుగు మంచిమాటలు జెప్పక, లేనిపోనివి చెప్పి వాడి మనస్సింకా విరగ్గొట్టండి. ఇంకేమనుకున్నారు వాడికి? అమ్మున్నాదా, నాన్నున్నాడా?... వాడికి ఒకదారి చూపించడంపోయి, యిదా మీరుజేసే ఘనకార్యం?" అంటూ చెమర్చిన కళ్ళను చీరకొంగుతో తుడుచుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది నవనీతం.

"మిగిలిన ఆడవాళ్ళ విషయమేమోగానీ బావా-మా అక్కయ్య మనస్సు మాత్రం నవనీతమే!" అన్నాడు పాణిగ్రాహి నవనీతంలా కరిగిపోయి.

*　　　*　　　*

పాణిగ్రాహికి ఒక సుందరి కనిపించింది!

ఎక్కడ అని అడగండి. ఆ మేకలో!

ఆ సుందరి అక్కడ కనిపించడంలో ఆశ్చర్యమేమీ లేదని మీరూ ఒప్పుకుంటారు. మనం ఆశ్చర్యపడవలసినదంతా ఒక్క పాణిగ్రాహి విషయంలోనే! ఈతి రానివాడు ఈదులాడుతూ కనిపిస్తే మనం ఆశ్చర్యపోమూ? అతడామెను మనసారా ప్రేమించాడు. కనుక ఆమెను దేవకన్య అనవచ్చు. అటువంటి ఆకర్షణ దేవకన్యలలో తప్ప మరెవరిలో వుంటుంది?...

గడచిన రాత్రి_అతని అంతరాత్మ అతన్ని అడిగింది. "ఆమెకోసం అగ్గిలో దూకమన్నా దూకుతావా?..."

"చల్లగా!..." పాణిగ్రాహి సమాధానం.

"సంజీవ పర్వతాన్ని తేగలవా?"

"అరక్షణంలో..."

"దేవదానవులతో పోరాడగలవా?..."

"సవాల్!"

*  *  *

"ఆ మేడగదిలో నున్న చిన్న దెవరు?" అని అడిగాడు పాణి.

"అదంతా నీ కెందుకు?...నువ్వేమన్నా పెళ్ళి జేసుకో బోతావా, ఏమన్నానా?" అన్నాడు బావ.

"తప్పకుండా" అని మాటజారబోయి, మాటతప్పినవాడని అనిపించుకోవడం ఇష్టంలేక - 'పూరికేనే - తెలుసుకుందామని. నీకు తెలిస్తే చెప్పు' అన్నాడు పాణిగ్రాహి.

"అది తాసీల్దారుగారిమేడ. కొత్త తాసీల్దారు ఈ వూళ్లో అంటే ఆ మేడలో కాపురంపెట్టి వారం అవుతోంది. అంతే! అంతకన్నా నాకేం తెలీదు, నిజం." అనేసి - కాఫీకాస్తోన్న నవనీతం దగ్గరికి వెళ్ళి, 'మీ తమ్ముడి బ్రహ్మచర్యవ్రతం యింకెన్నాళ్లో కొనసాగదులే! అప్పుడే- ఆ తాసీల్దారింట్లో అమ్మాయిపైన కన్నేశాడు!' అంటూ నవ్వీపోయాడు నారాయణ.

"నిజంగానా? అంటూ నోరు తెరుచుకున్నది నవనీతం.

"నీతోడు!"-ఆమెనెత్తి అదిరిపోయింది.

తొమ్మిదిన్నరకల్లా మిస్టర్ నారాయణ బి., ఏ. బి. ఇడి. సూటులు తొడుక్కుపోయాడు.

పాణిగ్రాహికేం తోచలేదు. కిటికీదగ్గర కూర్చుని గడ్డం గీసుకున్నాడు. స్నానం చేశాడు. తిరిగివచ్చి కిటికీ దగ్గరకొచ్చి కూర్చోబోయాడు. అక్కయ్య పిలిచింది. టిఫిను తిని, కాఫీ తాగాడు. కిటికీదగ్గరకొచ్చి కూర్చున్నాడు.

ఆ మేడగది కిటికీలోంచి — అతని ప్రణయ సామ్రాజ్ఞి తెలిమబ్బుల వెనుక చంద 'భా' మలా కనిపించి, మైమర పించి, మాయమైపోతోంది.

పాణిగ్రాహి ఏదో తత్వం పాడబోయి, చటుక్కున నాలిక్కొరుక్కుని, 'అయ్యో, ప్రేమగీతమన్నా నేర్చు కున్నానుగానే!' అని గిలగిల్లాడిపోయి, అటుపిమ్మట — 'ప్రేమగీతం కాకపోతే పోయె; అన్యాయంగా నాలిక్కొరు క్కున్నానే!' అంటూ వాపోయాడు.

తలలో కలలు మెదిలి, కలలో ఆమె మెదిలి, కల కరిగి, ఇలలో వాలిరిగి, 'నే నెక్కడున్నాను?' అని ఆశ్చర్యపడి పోయి, 'ఇది కలా?' అని నిరాశపడిపోయాడు.

చదివి బాగుపడదామని పుస్తకం తీసుకున్నాడు. తెరిచాడు. చదవబోయాడు. అందులో — తన ప్రియురాలు నవ్వుతూ కనిపించింది. పేజీ తిరగేశాడు. అక్కడా అమ్మాయి బొమ్మే! కెమిస్ట్రీ పుస్తకాలలో తాసీల్దారుగారి అమ్మాయిలా బొమ్మ లెందుకేస్తున్నారో అనుకొని, కన్నులు నులుముకున్నాడు. పుటలన్నీ తిరగేశాడు. అన్నిట్లోనూ ఆ ఎలనాగ నగుమొగమే!...పుస్తకంమూసి ఆ మేడగది కేసి చూశాడు. సర్వాంతర్యామిలా అక్కడా సాక్షాత్క రించి, అంతలో అంతర్ధానమైంది ఆ సుమధుర హాసిని.

పాణిగ్రాహి లేచి బయటకొచ్చాడు. అతన్ని చూసి భగ్గున మండిపడుతున్నాడు సూర్యుడు.

"ఇప్పుడే భోంచేస్తావా, బావతో బాటు భోంచేస్తావా?" అంటోంది నవనీతం—యింటిలోపించి. అతని చెవులు మరపూడిపోయిన మిషన్‌లా వూరుకున్నాయి. అతడు గడియారం చూసుకున్నాడు. పదకొండుగంటల ఏభైనిమిషాలైంది. నడిచాడు. పడకపందెంలో పాల్గొన్న ఆటగాడిలా నడిచాడు. ఆ మేడదగ్గర ఆగాడు. "అమ్మయ్య! ఎంతదూరం! ఎంతసేపు!" అంటూ నిట్టూర్చాడు. గడియారం చూసుకున్నాడు. పదకొండుగంటల ఏభైఒక్క నిమిషాలు.

ఆమేడచాలా అందంగాఉంది. ఆఅమ్మాయి లేకపోతే ఆమేడకు అందమేలేదేమో! ఆ మేడకు ప్రహరీ గోడ లేవు. ఇంటిముంగిట అమ్మాయి నవ్వులపంటలా చిన్న పువ్వుల తోట! ఆ తోటకు మూడువైపులా వెదురుబద్దల తడికెలు, వెదురుబద్దలతో చిన్న తలుపు. ఆ తలుపును, మేడ తలుపును కలుపుతూ తోటనడుమ సన్నటి త్రోవ.

మేడ వసారాలో—ఆ అమ్మాయికి కాపలాదారులా—ఓ పెద్దకుక్క గొలుసుల్తో కట్టబడివుంది. పాణిగ్రాహి తోట కివతల నిలబడి తటపటాయింగాడు. కుక్క బిగ్గరగా 'లొళ్లు' మంది. పాణిగ్రాహి ఎగిరిపడి, గుండెసర్దుకుని, గుండీ సర్దుకుని—"నువ్వే వెళ్ళు!" అన్నాడు.

గుట్టమీద నిలబడి దూరంగా లోయల్లోకి చూస్తే పెద్దపులిలా – నిలబడి – 'ఏదీ, గుండెలుంటే రా చూద్దాం" అన్నట్టు చూసింది కొండ. తన ఆరంభశూరత్వానికి సిగ్గుపడి తలతిప్పుకున్నాడు పాణిగ్రాహి.

ఇంటిలోనుంచి ఒకడు బయటకొచ్చాడు. బిళ్ళగోచీ, బనీను, పెద్దమీసాలు — చేతిలో సంచీ — వాడి నౌకరీ నౌకరుగిరీ అని చూడగానే చెప్పొచ్చు. వాడు పాణిగ్రాహిని చూసి, "ఎవరు నువ్వు?" అన్నాడు. మళ్ళీ గబుక్కుని "ఏం కావాలి?" అన్నాడు.

పాణిగ్రాహికి ఏమీ తోచక – మాటలు తడబడ – "నువ్వు తాసీల్దారువా?" అన్నాడు.

వాడు ఏమీ చెప్పలేక యిరుకునపడి "ఏం?" అన్నాడు.

"తాసీల్దారుతో పనుంది."

"తర్వాత రా పో"

"ఇంటిలో లేరా?"

"తర్వాత రమ్మంటే – లేరనే అర్థం."

"ఇంటిలో మరెవ్వరూ లేరా!"

"అమ్మాయిగారూ, వంటావిడా తప్ప దోమైనా లేదు".

"నల్లులూ?"

"నెత్తురు పీల్చేస్తున్నాయ్!"

"నువ్వెవరవు? అమ్మాయికి బాడీగార్డువా?"

"నీ మాటలూ వాలకమంతా చూస్తూంటే—తాసీల్దారుగారి మేనల్లుడివిలా వున్నావే?..."

పాణిగ్రాహి పులకరించి పోయాడు. "నీనోరు మంచిదైతే - నువ్వన్నట్టే - 'నల్లు'డినో, అల్లుడినో కాకూడదేంటీ?..."

"ఏందీ?—ఇట్టాటి మొగమా తేనెదీసేదీ అని - నీయట్టా మొగమా అల్లుడయ్యేది?-వెళ్ళవయ్యా వెళ్ళు!" అంటూ ఆ 'నౌకరుడు' బజారుకు కాబోలు వెళ్ళిపోయాడు.

పాణిగ్రాహి కోపాన్ని చల్లార్చుకునేందుకు - మేడ ప్రక్కన నీడలోనికి వచ్చాడు. తలపైకెత్తి పైపై చూశాడు. కిటికీ సరిగ్గా కనుపించలేదు. వెనక్కు ఒక్కొక్క అడుగే వేశాడు. రాయితగిలి - 'సహజమైన నటన అంటే యిదే!' అనిపించేలా దభేలున క్రిందబడ్డాడు.

నీళ్ళలో తెడ్లు కదలాడినట్లు, నాలుగు చిలుకలు పకపకలాడినట్లు - 'కిలారు'మంటూ ఓ నవ్వువచ్చి చెవిలో పడింది. పాణిగ్రాహి_కిటికీ వెనకాల మెరిసిపోతూన్న రెండు నీలి నక్షత్రాలను, ఓ ముత్యాలదండను చూశాడు. తల తెగిపోయినంత బాధపడ్డాడు. అలిగిన సత్యభామలా ముఖం పెట్టాడు. ఆమె నవ్వడం ఆపి వూరుకుంది. వెళ్ళిపోతానన్నట్లు రెండడుగులు వేశాడు. తిరిగిచూశాడు. ఆమె బొమ్మలా అలాగేవుంది. "వెళ్ళిపోనులే" అన్నట్టు చిరునవ్వు నవ్వాడు. ఆమెకూడా జంకు లేకుండా నవ్వింది. చారెడు తేనె నాక్కున్నట్లయింది పాణిగ్రాహికి. అతని శరీరం బరువుగా లేకపోతే అతని మనస్సు బొందెతోబాటు పైకి తేలిపోయేదే!...

"నువ్వు పైన; నేను కింద. పైకెలారాను?" అంటూ సంజ్ఞ చేశాడు. ఆమె సిగ్గుపడి తలొంచుకుని, చేతిగాజులు సవరించుకో సాగింది.

పాణిగ్రాహి చుట్టూచూశాడు. చుట్టూ చెట్లే! ఆ చెట్లసందుల్లోంచి బావగారి యిల్లు, ఆ యింటికి ఒంటికన్నులా తన గదికిటికీ కనిపిస్తున్నాయి. మేడప్రక్కన దగ్గరగా ఓ నేరేడు చెట్టుంది. ఆ చెట్టులోంచి, స్వర్గానికి వంతెనలా ఓ కొమ్మ కిటికీదగ్గరగా వెళ్ళి ఆగింది.

చెట్లెక్కాలంటే భయపడే పాణిగ్రాహి వానరంలా చెట్టుపైకి లంఘించాడు. కొమ్మమీదికి దాటుకున్నాడు. కిటికీకి వీలైనంత దగ్గరగా ప్రాకి నిలబడ్డాడు... ఆమె అతనికేసి తెల్లబోయి చూస్తూనే ఉంది.

"నాపేరు పాణిగ్రాహి!" అన్నాడు.

"బి. ఏ. చదువుతున్నాను!" అన్నాడు.

"నీ పేరేం?" అన్నాడు.

ఆమె చెప్పలేదు.

"చెప్పవూ?..."

ఆమె సిగ్గుతో – కోసిపారేసిన తమ్మిపూవులా ముడుచుకుపోతోంది...

"పోనీలే!... నువ్వంటే నాకు చాలా యిష్టం!—మరి నేనంటే నీ కిష్టమేగదూ?..."

ఆమె చెంపలు చిదిమివేసినట్లు ఎర్రనై పోయాయి.

"మరైతే—మనిద్దరమూ పెళ్ళాడుదాం..." అన్నాడు పాణిగ్రాహి. ఆమె రెండు చేతులతో ముఖం గట్టిగా కప్పు

కుని-పరుగెత్తిపోయింది. పాణిగ్రాహి కిటికీమాట కూడా మరిచిపోయి-తన వలపులకొమ్మను పట్టుకుందామన్న తొందరలో పట్టుకొమ్మని విడిచిపెట్టి, మళ్ళీ చెట్టుకొమ్మనే పట్టుకున్నాడు.

ఇంతలో - యింటిముందు ప్రత్యక్షమైన తాసిల్దారు-యింటిప్రక్క నేరేడుకొమ్మకేసి చూశాడు. 'అశోక వనమున హనుమంతుడిలా' పాణిగ్రాహి అతని కంటపడ్డాడు. తాసీల్దారు రావడం పాణిగ్రాహి ఎరుగడు. అతనికి ఒక పొలికేక మాత్రం వినిపించింది. "ఎవరది చెట్టుమీద?"

ఈ కేక చెట్టు మీదున్న వాడి చెవిని బడేలోగా-తాసీల్దారు చెట్టుకిందకొచ్చేశాడు.

మరో కేక! "ఎవరు నువ్వు?..."

"నేను స్వర్గంనుంచి వస్తున్నాను. భూలోకాని కెటూ దారి?" అన్నాడు-కొమ్మపైనుంచీ-పాణిగ్రాహి.

"ఏమ్! తాసీల్దారుతో నా సి పరియాచకాలు?...

"మీరు తాసీల్దారులా?_" పాణిగ్రాహి గుండె జారి పోయింది.

"చెట్టెందు కెక్కావ్?..." అన్నాడు తాసీల్దారు-మూలిగే నక్కమీద తాటికాయ వేస్తూ.

పాణిగ్రాహి భయంతో గడగడలాడిపోయాడు. అతని కాళ్ళు చేతులు వణికిపోయాయి. అతడెక్కిన కొమ్మంతా వణికి పోయింది.

అతడిమాటలూ వణికిపోయాయి. "మరి... మరి..మరినా.. మరినా... గా... గాలిపటం... చి... చి... చిక్కుకొంది..."

తాసీల్దారుకదిలి - "తరినాం తరినాం తరినాం తదిగిణ తకతోం తదినాం...." అని వినిపించింది. "దిగిరా కిందికి" అంటూ గర్జించాడాయన.

పాణిగ్రాహి ప్రాణాలు పైకిరిపోయాయి. గుండె దడతో కాళ్ళు గడగడలాడ, దిగబోయే గడబిడలో - నేరేడు పుల్ల ఒకటి పటుక్కున విరిగింది. హడలిపోయి, "అమ్మోయ్" అని కేకేసి కళ్ళుమూసుకుని, నెమ్మదిగా కళ్ళు తెరచి - విరిగినది తానున్న కొమ్మకాదనే, తాసీల్దారు తలపైనబడిన చిన్నరెమ్మ అనీ తెలుసుకున్నాడు.

"దిగిరమ్మంటుంటే?..." అయ్యో దురదృష్టమా! ఇంత మొండివాడుగా వున్నాడేం ఈ తాసీల్దారుడు?...

"లేదండీ! తెలియక ఎక్కానండి! బుద్ధుంటే యికెప్పుడూ ఎక్కనండీ!" ఏడుద్దామనుకుని ఏడవలేకపోయాడు పాణిగ్రాహి.

"నిన్నేమీ అనను లే! రా కిందికి!"

పాణిగ్రాహి ముఖం చూస్తే-అతడనుభవించిన శిక్షకు యావజ్జీవిత కారాగారవాస శిక్షకూడా దీటురాదేమో అనిపిస్తుంది.

తాసీల్దారు తనని బట్టలూడదీసి, చింతబరకెలతో వాతలెగరగొట్టిగానీ విడిచిపెట్టడు - అని నిశ్చయించుకొనే కాడు పాణిగ్రాహి. అంతటి భయంలోనూ, అతనికొక ఆశా జ్యోతి కనిపించింది. అది-క్రిందికి వెళ్ళాక పలాయన మంత్రం పఠించడ!... తప్పుతూ తారుతూ కిందికి దిగివచ్చాడు.

"నీకు పిచ్చిబట్టింది... నువ్వు మా అమ్మా
ప్రేమిస్తున్నావన్నమాట..."

"అంతమాట నే అన్నానాండీ? వారే నన్ను ప్రే
స్తున్నారు."

"అయితే వారిని పెళ్ళాడతావా?" భుజం తట్ట
అడిగాడు తాసీల్దారు.

పెళ్ళాడతా ననడానికి గుండెలు చాలక సందిగ్ధంలో
పడ్డాడు పాణిగ్రాహి. నిన్నటి రాత్రి అంతరాత్మ అడిగిన
ప్రశ్నలు, సమాధానంగా తన ప్రగల్భాలు అన్నీ జ్ఞాపకం
వచ్చాయతనికి. ఒక్కసారిగా ఒళ్ళు మరచిపోయి, ఛాతి
ముందుకు పెట్టి, పిడికిలి బిగించి గట్టిగా బల్లగుద్ది, 'ఆమె
కోసం ప్రాణాలిమ్మన్నా యివ్వడానికి తయార్...'' అన్నాడు
బల్లగుద్దినంత గట్టిగా.

తాసీల్దారు విస్తుపోయి నోరు దెరచుకున్నాడు.
"ముందు ముందు అందరూ నీలా గప్పాలు కొట్టినవాళ్లే!
వాళ్ళకుమల్లే నువ్వూ తేలుకుట్టిన దొంగలా వెళ్ళిపోక
ఏముంది?..."

"లేదండీ! - మీరు ఏ ప్రమాణం చేయమన్నా
స్తాను. మాటంటే-మాట తప్పుతానా? కావలిస్తే-యిప్పుడే
కు పూల దండలకు ఆర్డరివ్వండి..."

"ఇదిగో - పాణిగ్రాహీ! చెబుతున్నాను విను! నువ్వు
కరపడ్డావు. మా అమ్మాయికి-ఆ విధాత తప్ప మరొకరు
చలేని లోపం ఒకటుంది. అందచందాలు...

...ఫ్పన దేవుడు ఆమెకు నోరు మాత్రం ఒకటి లేకుండా ...డు—"

"ఏమిటీ?!..."

"ఔను. ఆమె మూగది!"

ఇది విని పాణిగ్రాహి అజాండమంతంటి ఆశ్చర్యానికి లోనయ్యాడు. మాటలాడలేక సిగ్గుతో చిగురుటాకులా తత్తరించిపోయిన ఆ అమ్మాయి మూకవిగ్రహం అతని ఊహా దర్పణంలో ప్రతిబింబించింది.

చీపురుదెబ్బలు తిన్న సద్బ్రాహ్మడు, నవనాగరపు వన్నెలాడి మగడు, సన్యాసం పుచ్చుకున్న భర్తయ్య, ఆత్మహత్య చేసుకున్న శవంగాడు-అందరూ జ్ఞాపకం వచ్చారతనికి. అతడు అర్థంలేని సంతోషంతో-తాసిల్దారు చేతులు పట్టుకొని, ఆయన ఆశ్చర్యపోయేలా, ఆనందంతో సెభాష్ అని వెన్నుచరిచేలా-యిలా అన్నాడు.

"అయినాసరే మామగారూ! తొలి నే జేసిన పూజాఫలము! మీ అమ్మాయిని పాణిగ్రహణం చేసుకోడాని... నేను వెనకాడను. మూగదానికన్నా మంచిపెళ్ళాం ఎక్క... దొరుకుతుంది కలియుగంలో?"

*　　　*　　　*

"ఎక్కడన్నా యిలా జరగడంకద్దా?" అనో... మీరు-అంతా చదివి. ఇది సంభవమేనా-అన్న సందే... యిక్కడ మనకనవసరం; ఇది-కథ!

—o—